
సాక్షి పల్నాడు
శుక్రవారం । 26 । ఏప్రిల్ । 2024



పరంజ్యోతి కల్కి ఆలయ ప్రతిష్టాపన

తెనాలి: పరంజ్యోతి సేవాసంఘం ఆధ్వర్యంలో రూరల్ మండలం బుర్రిపాలెం వద్ద నూతనంగా వరసిద్ధి శ్రీపరంజ్యోతి కల్కి ఆలయ ప్రతిష్టాపన మహోత్సవం ఘనంగా జరిగింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 505.70 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.



ద్వాదశ ప్రదక్షిణలు

ఇంద్రకీలాద్రి: చైత్రమాస బ్రహ్మోత్సవాల ముగింపును పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల పవళింపు సేవ గురువారం నిర్వహించారు.

సత్తెనపల్లి జనసంద్రం

- అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేసిన అంబటి రాంబాబు
- గ్రామాల నుంచి తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు
- దేవరంపాడు నుంచి సత్తెనపల్లి వరకు భారీ ర్యాలీ
- రెపరెపలాడిన వైఎస్సార్ సీపీ జెండాలు
- అడుగడుగునా ఘనస్వాగతం



సత్తెనపల్లిలో అంబటి నామినేషన్ కార్యక్రమానికి తరలివచ్చిన జన సందోహం

సత్తెనపల్లి: సత్తెనపల్లి పట్టణం జనసంద్రంగా మారింది. వేలాదిగా తరలివచ్చిన ప్రజలు, అభిమానుల కేరింతలు, కోలాహలం నడుమ వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు నామినేషన్ పర్వం గురువారం అట్టహాసంగా సాగింది. ఉదయం పట్టణంలోని మర్కస్ మసీదులో ముస్లిం పెద్దలతో కలిసి దువా చేశారు. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల భాగ్యనగర్ కాలనీలోని అగాపే చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. రాజుపాలెం మండలం దేవరంపాడులోని నేతి వెంకన్నస్వామి దేవాలయంలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అభిమానులు, కార్యకర్తలు వెంటరాగా ప్రత్యేక వాహనంపై దేవరంపాడు నుంచి ర్యాలీగా బయలుదేరారు. నియోజకవర్గంలోని సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ల, రాజుపాలెం, నకరికల్లు మండలాల నుంచి నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు జనం తరలివచ్చారు. దీంతో ట్రాఫిక్ స్తంభించి పోయింది. దేవరంపాడు నుంచి సత్తెనపల్లి వరకు ప్రతి గ్రామంలోనూ అంబటికి స్థానికులు ఘన స్వాగతం పలికారు. కొండమోడులో ఊహించని రీతిలో జనం ఎదురొచ్చి అంబటికి మద్దతు ప్రకటించారు. అక్కడి నుంచి ర్యాలీగా అనుపాలెం చేరుకున్నారు. జన సందోహంతో ర్యాలీగా రాజుపాలెం చేరుకున్నారు. గ్రామ సర్పంచ్ పులిబండ్ల అశోక్ నేతృత్వంలో ప్రజలు పెద్దఎత్తున రోడ్డుపైకి వచ్చారు. ఆయన వాహనం దిగి కొంత దూరం పార్టీ శ్రేణులతో కలిసి నడిచారు. గజమాలతో మంత్రి అంబటిని సత్కరించారు. అక్కడి నుంచి ర్యాలీగా రెడ్డిగూడెం చేరుకోగా ప్రజలు రోడ్డుపైకి చేరుకొని నినాదాలు ఇచ్చారు. అక్కడి నుంచి ర్యాలీగా సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల గ్రామం చేరుకోగానే పార్టీ మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు ఆధ్వర్యంలో 500 బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. 108 గుమ్మడికాయలతో మంత్రి అంబటి రాంబాబుకు మహిళలు దిష్టి తీశారు. గజమాలతో సత్కరించారు. భాగ్యనగర్ కాలనీ చేరుకోగానే ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు చిలుకా జైపాల్ ఆధ్వర్యంలో మహిళలు, ప్రజలు పెద్ద ఎత్తున ముందుకు వచ్చి ఘన స్వాగతం పలికారు. జనానికి మంత్రి అంబటి రాంబాబు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. సత్తెనపల్లి మండలం వెన్నాదేవి గ్రామంలో ఎంపీ అభ్యర్థి డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్ ప్రత్యేక వాహనం పైకి ఎక్కారు. దీంతో కార్యకర్తలలో ఉత్సాహం రెట్టింపు అయ్యింది. గ్రామంలో అడుగడుగునా స్వాగతం లభించింది. పట్టణంలోని చెక్‌పోస్ట్ వద్దకు చేరుకోగానే పెద్ద సంఖ్యలో పర్యలు హాజరై బ్రహ్మరథం పట్టారు. దారి పొడవునా ఎటు చూసినా వైఎస్సార్ సీపీ జెండాలు రెపరెపలాడాయి. ప్రత్యేక వాహనంపై నుంచి అభివాదం చేస్తూ చెక్‌పోస్ట్ వద్ద నుంచి ఐదు లాంతర్ల సెంటర్, గడియార స్తంభం సెంటర్ నుంచి తాలూకా సెంటర్‌కు చేరుకోవడానికి గంటకుపైగా సమయం పట్టింది.

విజయోత్సవ ర్యాలీలా...

అంబటి రాంబాబు నామినేషన్ ర్యాలీ విజయోత్సవ ర్యాలీలా సాగింది. ఎటు చూసినా వైఎస్సార్ సీపీ జెండాలే. ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించేలా కార్లు, బైకులు, ఆటోలతో భారీ ర్యాలీ. అనిల్‌కుమార్ యాదవ్, అంబటి రాంబాబును గెలిపిస్తామని, విశ్వాస ఘాతుకులైన కూటమి అభ్యర్థులను ఓడిస్తామని ప్రతీన బూనారు.

నామినేషన్ దాఖలు

వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా అంబటి రాంబాబు ఒక సెట్ నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ పత్రాలను ఆర్వో వి మురళీకృష్ణకు అందించారు. నామినేషన్ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యుడు యర్రం వెంకటేశ్వరరెడ్డి, గుంటూరు మిర్చి యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావులు పాల్గొన్నారు.



అనిల్‌కుమార్ యాదవ్, అంబటిలను గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం



అభివాదం చేస్తున్న అనిల్‌కుమార్ యాదవ్, అంబటి



రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న అంబటి రాంబాబు

న్యూస్‌రీల్

29న సీఎం వైఎస్ జగన్ పొన్నూరు రాక

పొన్నూరు: ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 29వ తేదీన పొన్నూరు బహిరంగ సభలో పాల్గొననున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తలశిల రఘురాం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం 3 గంటలకు జరిగే సభలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

పోలీసు పరిశీలకునిగా డీఐజీ అజిత్‌సింగ్ నియామకం



నరసరావుపేట: జిల్లాకు ఎన్నికల పోలీసు పరిశీలకునిగా డీఐజీ డాక్టర్ అజిత్‌సింగ్ నియమితులయ్యారు. గురువారం ఆయన నరసరావుపేటకు వచ్చారు. మున్సిపల్ అతిథి గృహంలో ఉన్న ఆయనను జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాలో పరిస్థితిపై ఇరువురూ చర్చించారు. తీసుకున్న చర్యలను ఆయనకు ఎస్పీ వివరించారు.

కంట్రోల్ విభాగాన్ని పరిశీలించిన అబ్జర్వర్



నరసరావుపేట: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు పెదకూరపాడు, సత్తెనపల్లి, గురజాల, మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గాలకు జనరల్ అబ్జర్వర్‌గా నియమితులైన బూరె సర్వేశ్వరుడు నరేంద్ర గురువారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శివశంకర్ లోతేటిని మర్యాదపూర్వకంగా చాంబర్‌లో కలిశారు. కమాండ్ కంట్రోల్ రూంను పరిశీలించి తన సూచనలు, సలహాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణలో సమస్యల నివారణకు ప్రతి రోజూ ఉదయం 11 నుంచి 12 గంటల వరకు 91546 90367 నెంబర్‌లో అందుబాటులో ఉంటానని, ఆ సమయంలో ఎవరైనా ఫోన్‌చేసి సమస్యలను తన దృష్టికి తీసుకురావచ్చని ఆయన తెలిపారు.

సాగర్ కుడికాలువకు నీటి నిలుపుదల

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడికాలువకు గురువారం నీటిని నిలుపుదల చేశారు. కుడికాలువ పరిధిలోని గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు తాగునీటి అవసరాల నిమిత్తం ఈనెల 8న కృష్ణా యాజమాన్య బోర్డు 8టీఎంసీల నీటిని కేటాయించింది. నీటి విడుదల పూర్తవ్వటంతో కేఆర్ఎంబీ ఈఈ రఘునందన్ సమక్షంలో ఉదయం 8.30గంటలకు గంటకు 1,000 క్యూసెక్కుల చొప్పున తగ్గిస్తూ మధ్యాహ్నం 12 గంటలకు కుడికాలువ నుంచి విడుదలవుతున్న నీటిని పూర్తిగా నిలిపివేశారు. ప్రస్తుతం సాగర్ జలాశయ నీటిమట్టం 505.70 అడుగుల వద్ద ఉంది.

టీడీపీ ప్రచారంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు



నరసరావుపేటరూరల్: ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాజకీయ నాయకుడి అవతారం ఎత్తాడు. పసుపు కండువా కప్పుకుని రాజకీయం చేస్తున్నాడు. పేరుకే ప్రభుత్వ ఉపాధ్యాయుడే కాని మండలంలోని పెట్లూరివారిపాలెంలో టీడీపీ పెత్తనం అంతా ఇతనే చేస్తున్నాడు. టీడీపీ ఆధ్వర్యంలో గ్రామంలో నిర్వహించిన ప్రచార ర్యాలీలో పాల్గొంటున్నాడు. గ్రామానికి చెందిన తిరుమలశెట్టి శ్రీనివాసరావు నాదెండ్ల మండలం కోమటినేనివారిపాలెం గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. గ్రామంలో ఇటీవల నిర్వహించిన టీడీపీ ప్రచారంలో నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ అరవింద్‌బాబు, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు పాల్గొన్నాడు. నిబంధనలకు విరుద్ధంగా పార్టీ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న శ్రీనివాసరావుపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రశాంతంగా ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్షలు



ఏపీఆర్‌జేసీ క్యాట్ ప్రవేశ పరీక్ష నిర్వహణను పరిశీలిస్తున్న డీఈఓ వెంకటేశ్వర్లు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాలకు గురువారం నిర్వహించిన ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పట్టణంలో ఏపీఆర్‌జేసీ క్యాట్, ఏపీఆర్‌జేసీ సెట్–2024 ఎంట్రన్స్ టెస్ట్‌కు ఏర్పాటు చేసిన 11 పరీక్ష కేంద్రాలలో జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు చేశారు. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. 50 గురుకుల పాఠశాలల్లో ఐదు నుంచి 8వ తరగతి వరకు ప్రవేశాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిర్వహించిన ఏపీఆర్‌జేసీ క్యాట్ పరీక్షకు 921మంది దరఖాస్తు చేసుకోగా 745మంది విద్యార్థులు హాజరయ్యారు. 176మంది గైర్హాజరయ్యారు. గురుకుల జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహించిన పరీక్షకు 2050మంది దరఖాస్తు చేసుకోగా 1716మంది హాజరయ్యారు. 334 మంది గైర్హాజరయ్యారు. డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి 77మంది దరఖాస్తు చేసుకోగా 67మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు, జిల్లా ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ కె.ఎం.ఏ.హుస్సేన్, ఏపీఆర్‌జేసీ జాయింట్ సెక్రటరీ ఒబెయదుల్లా, జిల్లా కోఆర్డినేటర్ ఎం.సరోజిని తదితరులు పర్యవేక్షించారు.

నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.6400, గరిష్ట ధర రూ.8500, మోడల్ ధర రూ.7200 వరకు పలికింది.

ముగిసిన నామినేషన్ల ఘట్టం

- సార్వత్రిక ఎన్నికల్లో భారీగా నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులు
- పార్లమెంట్ స్థానానికి 27 మంది, ఏడు అసెంబ్లీలలో 179 మంది
- నేడు నామినేషన్ల పరిశీలన
- 29వ తేదీతో ముగియనున్న ఉపసంహరణ గడువు
- విజయోత్సవ ర్యాలీలను తలపించేలా సాగిన వైఎస్సార్సీపీ అభ్యర్థుల నామినేషన్లు
- జిల్లాలో ఫ్యాన్ సునామీ ఖాయం అంటున్న రాజకీయ విశ్లేషకులు

గడువు ముగిసే సమయానికి నమోదైన నామినేషన్ల సంఖ్య...

స్థానం	మొత్తం అభ్యర్థులు	దాఖలైన నామినేషన్ సెట్లు
పార్లమెంట్		
నరసరావుపేట	27	40
అసెంబ్లీ స్థానం	మొత్తం అభ్యర్థులు	దాఖలైన నామినేషన్ సెట్లు
పెదకూరపాడు	26	51
చిలకలూరిపేట	33	49
నరసరావుపేట	25	48
సత్తెనపల్లి	22	38
వినుకొండ	24	39
గురజాల	25	37
మాచర్ల	24	40
మొత్తం	179	302

సాక్షి, నరసరావుపేట: 2024 సార్వత్రిక ఎన్నికల్లో కీలకమైన నామినేషన్ల దాఖలు ఘట్టం గురువారంతో ముగిసింది. ఈనెల 18న నోటిఫికేషన్ విడుదలతో మొదలైన నామినేషన్ పత్రాల సమర్పణ 25వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు ముగిసింది. జిల్లాలో ఒక పార్లమెంట్, ఏడు అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులు పెద్ద సంఖ్యలో నామినేషన్లు దాఖలు చేశారు. నరసరావుపేట పార్లమెంట్ స్థానానికి తుది గడువు ముగిసేలోగా 27 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. వీరు మొత్తం 40 సెట్ల నామినేషన్ పత్రాలు సమర్పించారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు కలిపి మొత్తం 179 మంది అభ్యర్థులు 302 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. అసెంబ్లీ స్థానాలకు అత్యధికంగా చిలకలూరిపేటలో 33 మంది, అత్యల్పంగా సత్తెనపల్లిలో 22మంది నామినేషన్లు దాఖలు చేశారు.

నేడు నామినేషన్ల పరిశీలన

అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు దాఖలైన నామినేషన్లను శుక్రవారం పరిశీలించనున్నారు. అభ్యంతరాల స్వీకరణ అనంతరం ఆమోదం పొందిన నామినేషన్ల జాబితాలను ఆర్వోలు ప్రకటిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు గడువు ఉంటుంది. నామినేషన్ల ఉపసంహరణ గడువు పూర్తయిన తర్వాత 29వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు పోటీలో నిలిచిన అభ్యర్థుల జాబితాలను విడుదల చేసి, వారికి కేటాయించిన ఎన్నికల గుర్తును అధికారులు ప్రకటించనున్నారు.

విజయోత్సవ ర్యాలీలా...!

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీచేస్తున్న అభ్యర్థుల నామినేషన్ ర్యాలీలు విజయం తరువాత జరిపే విజయోత్సవ ర్యాలీలుగా ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల నామినేషన్ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. అది చూసి 2019 ఎన్నికల మాదిరి రానున్న ఎన్నికల్లో పల్నాడు జిల్లాలోని ఏడు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ నియోజకవర్గం మరోసారి క్లీన్‌స్వీప్ అవుతుందన్న భావన జిల్లా వ్యాప్తంగా నెలకొంది. ఫ్యాన్ సునామిలో కూటమి అభ్యర్థులు అడ్రస్ గల్లంతు అవ్వడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

బీసీల అభ్యున్నతికి సీఎం జగన్ కృషి



మాట్లాడుతున్న నరసరావుపేట ఎంపీ అభ్యర్థి పి అనిల్‌కుమార్ యాదవ్, పక్కన ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్ నాయుడు

- నరసరావుపేట ఎంపీ అభ్యర్థి డాక్టర్ పి అనిల్‌కుమార్ యాదవ్
- ముదిరాజ్ ఆత్మీయ సమ్మేళనం నిర్వహణ
- ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్ నాయుడు హాజరు
- 300 మంది వైఎస్సార్ సీపీలో చేరిక

చిలకలూరిపేట: బలహీనవర్గాల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నరసరావుపేట ఎంపీ అభ్యర్థి డాక్టర్ పి అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో ముదిరాజ్ ఆత్మీయ సమ్మేళనం గురువారం నిర్వహించారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్ నాయుడు పాల్గొన్న ఈ కార్యక్రమంలో 300 మంది ముదిరాజ్ వర్గీయులు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ బీసీలను రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేసేందుకు అనేక పథకాలను సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టి బీసీల పక్షపాతిగా నిలిచారని కొనియాడారు. 139 బీసీ కులాలకు 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి చైర్మన్లు, డైరెక్టర్లను నియమించి సరికొత్త నాయకత్వానికి శ్రీకారం చుట్టారని కొనియాడారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ బీసీలకు ఆత్మస్థైర్యం కలిగించిన ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్ అని పేర్కొన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయ సాధన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తోనే సాధ్యమని అన్నారు. బీసీలకు మాటల్లో కాకుండా చేతల్లో మేలు చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు మాట్లాడుతూ ఆనాడు పూలే ఏ సమాజాన్ని అయితే ఆశించారో.. అదే సమాజ స్థాపన దిశలో అంబేడ్కర్ ఆలోచన విధానాన్ని తోడు చేసుకొని సీఎం ముందుకు సాగుతున్నారని అన్నారు. బీసీల ఓట్లు వేయించుకోవడం తప్ప ఏనాడు బీసీలకు మేలు చేసిన చరిత్ర లేని చంద్రబాబుకు బీసీల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు బీసీల తోలు తీస్తా... తోకలు కత్తిరిస్తా అంటూ బెదిరింపులకు పాల్పడిన విషయం గుర్తు చేశారు. నిత్యం బీసీ సంక్షేమానికి అంకితభావంతో పనిచేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి బీసీలంతా అండగా నిలవాలని కోరారు. వెంకటేశ్వరస్వామి గుడి కమిటీ సభ్యులతోపాటు, గువ్వల, కొండెబోయిన కుటుంబాలకు చెందిన 300 మంది పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి వైఎస్సార్ సీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో నార్త్ అమెరికా స్పెషల్ రిప్రజెంటిటివ్ ఫర్ ఏపీ పండుకాయల రత్నాకర్ నాయుడు, ముదిరాజ్ కార్పొరేషన్ డైరెక్టర్ కొండెబోయిన అనూష, ముస్లిం సంచార జాతుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ దరియావలి, వార్డు కౌన్సిలర్ షేక్ మీరాబీ, నాయకులు గువ్వల మణికంఠ, రాజు, మారుబోయిన నాగరాజు, కొండెబోయిన వెంకటేశ్వర్లు, వెంకట్రావు పాల్గొన్నారు.

ఇదేం..భాష్యం

- ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్
- దూసుకొచ్చిన టీడీపీ కార్యకర్తలు
- పోలీసులపై అనుచిత వ్యాఖ్యలు



నిబంధనలు అతిక్రమించి బైక్‌పై వస్తున్న ప్రవీణ్

పెదకూరపాడు: టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ నిబంధనలకు అడుగడుగునా తూట్లు పొడిచారు. నామినేషన్ వేసేందుకు పోలీస్‌లు ఏర్పాటు చేసిన బారికేడ్లను దాడుకుని ఆర్వో కార్యాలయంలోకి దూసుకొచ్చారు. పెదకూరపాడు టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్ ఉదయం 9 గంటలకు నామినేషన్ దాఖలు చేస్తున్నట్లు ప్రచారం చేసుకున్నారు. అమరావతి నుంచి పెదకూరపాడు వరకు ర్యాలీ ఏర్పాటు చేసుకున్నారు. బలుసుపాడు వరకు ర్యాలీలో పాల్గొన్న ప్రవీణ్ ప్రత్యేక వాహనం నుంచి దిగి బైక్‌పై 75 త్యాళ్లూరు, బుచ్చియ్యపాలెం మీదగా పెదకూరపాడు చేరుకున్నాడు. నామినేషన్ల సందర్భంగా అధికారులు ఆర్వో కార్యాలయం వద్ద వంద మీటర్లు దూరంగా బారికేడ్లను ఏర్పాటు చేశారు. బారికేడ్లను దాడుకుని అభ్యర్థి బైక్‌పై కార్యాలయానికి వచ్చాడు. ఇదే అదునుగా భావించిన ఆ పార్టీ కార్యకర్తలు ఆర్వో కార్యాలయం వైపు దూసుకెళ్లారు. పోలీసులు నివారించే ప్రయత్నం చేసినా వారిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ పరుగులుపెట్టారు. అమరావతి నుంచి ర్యాలీగా బయలుదేరిన ప్రవీణ్ కోసం కాలచక్ర రహదారిపై ఆ పార్టీ కార్యకర్తలు ఎదురుచూస్తున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంపై అభ్యర్థి భాష్యం ప్రవీణ్ కనిపించకపోయే సరికి అభ్యర్థి ఎక్కడ అంటూ కార్యకర్తలు చర్చించుకున్నారు. మండుటెండలో నిలబడి ఎదురుచూస్తేంటే అభ్యర్థి బైక్‌పై వెళ్లడంతో కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

భాష్యం ప్రవీణ్‌పై కేసు నమోదు

టీడీపీ పెదకూరపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి భాష్యం ప్రవీణ్ ఎన్నికల నియమావళి అతిక్రమించినందుకు ఎంసీసీ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు. నామినేషన్ సందర్భంగా వంద మీటర్ల దూరం నియమావళి దాటి పోలీసులను బెదిరించి ద్విచక్రవాహనంపై భాష్యం ప్రవీణ్ నామినేషన్ వేసేందుకు వచ్చినందుకు ఎంసీసీ అధికారులు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన ప్రతి ఒక్కరిపైనా కేసు నమోదు చేస్తామన్నారు. సీసీ పుటేజీ ఆధారంగా పరిశీలించి ఆయా వ్యక్తులపై కేసు నమోదు చేస్తామని ఎస్సై తెలిపారు.

శరవేగంగా అభయాంజనేయ స్వామి మండప నిర్మాణం

తాడేపల్లిరూరల్: సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై ఏర్పాటు చేయనున్న ఏకశిలా అభయాంజనేయస్వామి మండప నిర్మాణపనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన రామానుజ జీయర్‌స్వామి మంగళ శాసనాలతో విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై ఏర్పాటు చేయనున్న ఏకశిలా అభయాంజనేయస్వామి వారి విగ్రహానికి మండప నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. మండపనిర్మాణ పనులలో భాగంగా శ్లాబ్ పనులు గురువారం నుంచి ప్రారంభించామని, త్వరలోనే అభయాంజనేయస్వామి భక్తులచే పూజలు అందుకోబోతున్నారని వివరించారు. గుడిమెల్ల రఘునాథ్, నారాయణ, ఆలయ అర్చక బృందం, జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వేద విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



యార్డులో 66,153 బస్తాల మిర్చి



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 62,762 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 66,153 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.18,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి రూ.20,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 45,199 బస్తాల మిర్చి నిల్వ ఉంది.

అంతిమ విజయం జగనన్నదే

- సత్తెనపల్లిలో ఎగిరేది వైఎస్సార్ సీపీ జెండానే
- 175 కి 175 గెలుస్తామని అపారమైన నమ్మకముంది
- గత మెజార్టీ కంటే ఒక్క ఓటు తగ్గినా నాది నైతిక పరాజయమే
- మెజార్టీ విషయంలో మరోసారి పునరుద్ఘాటన
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు


మీడియాతో మాట్లాడుతున్న అంబటి రాంబాబు

సత్తెనపల్లి : అశేషంగా తరలివచ్చిన ప్రజల ఆదరణను చూసి తనకు అపారమైన నమ్మకం ఉందని, రాష్ట్రంలో అంతిమ విజయం జగనన్నదేనని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి, సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అంబటి రాంబాబు స్పష్టం చేశారు. రాష్ట్రంలో 175 కి 175 సీట్లు గెలుస్తామని పునరుద్ఘాటించారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో గురువారం ఆయన నామినేషన్ పత్రాలను ఆర్వో కార్యాలయంలో దాఖలు చేసిన అనంతరం బయటకు వచ్చిన తరువాత మీడియాతో మాట్లాడారు. 2014లో 924 స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యానని, అనంతరం 2019లో నియోజక వర్గ ప్రజలు తనపై చూపిన అభిమానంతో 20,876 ఓట్ల భారీ మెజార్టీతో గెలిపించారన్నారు. రానున్న ఎన్నికల్లో గత మెజారిటీకి ఒక్క ఓటు తగ్గినా నాది నైతిక పరాజయమేనని మరోసారి పునరుద్ఘాటించారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఐదు సంవత్సరాలుగా ధర్మ బద్ధంగా నడుచుకున్నానన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏ వర్గాన్నీ ఇబ్బంది పెట్టలేదని, వేధింపులు, కక్ష సాధింపులు లేని సుపరిపాలనను అందించానన్నారు. అందుకే ఈ ఎన్నికలు తన పరిపాలనకు రెఫరండంగా భావిస్తున్నానని స్పష్టం చేశారు. పింఛన్ తీసుకుంటున్న వృద్ధులు, సంక్షేమ పథకాలు తీసుకుంటున్న అక్క చెల్లెమ్మలు, అన్ని వర్గాలు మళ్ళీ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి గా రావాలని భావిస్తున్నారని విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో కూడా ప్రజలందరూ ప్రేమతో ఆదరించి ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఆయన అభ్యర్థించారు. నామినేషన్ కార్యక్రమానికి నాలుగు మండలాలు, పట్టణం నుంచి వచ్చిన అశేష ప్రజానీకానికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆయనతో పాటు మాజీ శాసన సభ్యుడు యర్రం వెంకటేశ్వరరెడ్డి, గుంటూరు మిర్చి యార్డ్ ఛైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, గుంటూరు డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు, ఏఎమ్‌సీ ఛైర్మన్ పెండెం బాబురావు, మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, చిట్టా విజయభాస్కరరెడ్డి, ఉన్నారు.

క్లుప్తంగా

మూడో నామినేషన్ దాఖలు చేసిన పిన్నెల్లి


ఆర్‌ఓకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మాచర్ల రూరల్ : మాచర్ల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మూడవ నామినేషన్ సెట్‌ను గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ. శ్యాం ప్రసాద్‌కి అందచేశారు. ఈయన వెంట వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి జూలకంటి వీరారెడ్డి, సీనియర్ న్యాయవాదులు చల్లా రామిరెడ్డి, చిలమకూరి నాగిరెడ్డి, శాంతిరెడ్డి తదితరులున్నారు.

రెండు చెక్‌పోస్టుల్లో రూ.3.19 లక్షల నగదు స్వాధీనం

చిలకలూరిపేట టౌన్: ఎన్నికల తనిఖీల్లో భాగంగా రెండు చెక్‌పోస్టుల వద్ద ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.3.19 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం మండలం పరిధిలోని ఈటీ చెక్‌పోస్టు వద్ద రూ.1.50 లక్ష నగదును చిలకలూరిపేట ఫ్లయింగ్ స్క్వాడ్ టీం అధికారులు తమ సోదాల్లో పట్టుకోగా, బొప్పూడి చెక్‌పోస్టు వద్ద ఉన్న ఎస్ఎస్‌టీమ్ అధికారులు రూ.1.69 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

దోమలను నిర్మూలించి ఆరోగ్యాన్ని కాపాడుకోండి

ప్రపంచ మలేరియా దినోత్సవ ర్యాలీని ప్రారంభించిన డీఎంహెచ్‌వో


ర్యాలీని పచ్చజెండా ఊపి ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవి

నరసరావుపేట : ఇళ్లు, వాటి పరిసరాల్లో దోమలు వృద్ధికాకుండా నీరు నిల్వ ఉండకుండా చేసి ప్రజారోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి ప్రజలకు సూచించారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గురువారం జిల్లా మలేరియా అధికారి కె.రవీంద్ర రత్నాకర్ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించి అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇళ్లల్లో వాడని వస్తువుల్లో వారం, అంతకు మించి నీరు నిల్వ ఉండకుండా చేయాలన్నారు. నిల్వ ఉండే మంచి నీటిలో దోమ 100 నుంచి 150 గ్రుడ్లు పెడుతుందని, అవి ఏడు నుంచి పదిరోజుల వ్యవధిలో దోమలుగా వృద్ధిచెంది ప్రజలపై దాడి చేస్తాయన్నారు. ఇవి కుట్టడం వల్ల మలేరియాతో పాటు డెంగ్యూ, చికెన్ గున్యా, బోధకాలు, మెదడువాపు వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతి శుక్రవారం ఇళ్ల పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించడం ద్వారా వ్యాధులను నివారించవచ్చన్నారు. ర్యాలీలో పాల్గొన్న పీహెచ్‌సీ వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు దోమలు నిర్మూలిద్దాం-వాటి ద్వారా వచ్చే వ్యాధులను అరికడదాం, శుభ్రత ఉంటే ఆరోగ్యం-లేకుంటే అనారోగ్యం, దోమలపై యుద్ధం-మన జీవితాలకు భద్రం, దోమ తెరలు వాడండి-దోమ కాటును నివారించండి, దోమకాటు ప్రజారోగ్యానికి చేటు, ప్రజారోగ్యానికి దోమలు ప్రధాన శత్రువులు, నీటితొట్టిపై మూత-దోమల పెరుగుదలకు కోత వంటి నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ కొనసాగింది. డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ హనుమకుమార్, పీఎండీవో రామకృష్ణ, సీహెచ్‌వోలు రామకృష్ణ, సుబ్బారెడ్డి, సీహెచ్.వెంకటేశ్వర్లు, కె.శ్రీనివాసరావు, కె.సాంబశివరావు పాల్గొన్నారు.

వరిచెత్త వేసి ద్విచక్ర వాహనం దహనం



వెల్దుర్తి : మండలంలోని గుండ్లపాడు గ్రామంలో బుధవారం అర్ధరాత్రి ఓ ద్విచక్ర వాహనాన్ని వరిచెత్త వేసి దగ్ధం చేసిన సంఘటన జరిగింది. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త దేరంగుల వెంకటేష్ తన ద్విచక్ర వాహనాన్ని ఇంటి ముందు పెట్టుకొని నిద్రపోతున్న సమయంలో ఆయన బావ టీడీపీ కార్యకర్త నాగమల్లయ్య ద్విచక్ర వాహనం పై వరిగడ్డి వేసి నిప్పు పెట్టడంతో వాహనం కాలిపోయింది. వాహనం పై మంటలు ఎగిసిపడుతుండటంతో వెంకటేష్ బయటకు వచ్చి వాహనం పై నీళ్ళు మంటలు ఆర్పాడు. వెంకటేష్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఈ శ్రీహరి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మరింత మేలు చేసేందుకు ఆశీర్వదించండి

- కారెంపూడి మండలంలో పీఆర్కే ఎన్నికల ప్రచారం
- అడుగడుగునా ప్రజల నుంచి అపూర్వ ఆదరణ


చినకొదమగుండ్లలో ప్రచార వాహనంపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న పీఆర్కే

కారెంపూడి : ప్రభుత్వ విప్, వైఎస్సార్‌సీపీ మాచర్ల నియోజకవర్గ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (పీఆర్కే) మండలంలోని చినకొదమగుండ్ల, ఇనుపరాజుపల్లె, బట్టువారిపల్లె, గాదెవారిపల్లె గ్రామాలలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే పీఆర్కేకు ఆ గ్రామాల్లో ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. చినకొదమగుండ్ల గ్రామంలోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేసిన అనంతరం ఆ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మొదట గ్రామానికి విచ్చేసిన పీఆర్కేకు గ్రామ మహిళలు గుమ్మడి కాయతో దిష్టి తీసి పూలవర్షంతో ఘన స్వాగతం పలికారు. ప్రచార రథంపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తూ ఫ్యాన్ గుర్తుకే ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతి గడపకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిని గుర్తుంచుకుని, ఆ సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలు అంతకంటే మెరుగ్గా కొనసాగేందుకు మద్దతు తెలిపి ఆశీర్వదించాలని పీఆర్కే కోరారు, మధ్యాహ్నం చినకొదమగుండ్ల గ్రామం నుంచి ప్రచారం ప్రారంభించి ఇనుపరాజుపల్లె, బట్టువారిపల్లె, గాదెవారిపల్లె గ్రామాల వీధుల్లో ప్రజలకు అభివాదం చేస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయాలు, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాలు, వ్యవసాయ గోడౌన్లు, ఆధునీకీకరించిన పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, రోడ్లు అభివృద్ధికి చిహ్నంగా కళ్ల ముందు దర్శనమిస్తున్నాయన్నారు. అలాగే ప్రతి గడపకు చేకూరిన లబ్ధి కుటుంబ సభ్యులందరికి తెల్సిందేనని ఎమ్మెల్యే పీఆర్కే ప్రజలకు గుర్తు చేశారు. ప్రతి ఇంటికి మరింత మేలు జరిగేందుకు అభివృద్ధి జరిగేందుకు మళ్లీ ముఖ్యమంత్రిగాజగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బొమ్మిన సావిత్రి, జెడ్పీటీసీ షేక్ షఫీ, ఆ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా గ్రామాల మండల పార్టీ నాయకులు పాల్గొన్నారు. కుమ్మరి శాలివాహన సంఘం ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బొంకూరి నాగేశ్వరరావు తదితరులు పీఆర్కేని గెలిపించాలని కోరుతూ కరపత్రాలు పంచుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.


చినకొదమగుండ్లలో పీఆర్కేకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

టీడీపీ అధికారంలోకి వస్తే రాక్షస పాలనే

వైఎస్సార్‌సీపీ నరసరావుపేట ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్


ప్రచార రథంపై ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్ నాయుడు

చిలకలూరిపేట : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో పేదలందరికీ అండగా నిలిచారని, టీడీపీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలో రాక్షసపాలన వస్తుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నరసరావుపేట ఎంపీ అభ్యర్థి పి. అనిల్‌కుమార్ యాదవ్ చెప్పారు. చిలకలూరిపేట మండలంలోని కమ్మవారిపాలెం, కట్టుబడివారిపాలెం, యడవల్లి, మద్దిరాల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీగా ప్రచారరథంపై రోడ్‌షోను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి పి అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ అబద్దాలను చెప్పి అధికారం దక్కించుకోవాలనే ఆరాటంతోనే చంద్రబాబు కూటమిని ఏర్పాటు చేశారన్నారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికల్లో ప్రజలు విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయాలని కోరారు. ప్రజలకు ఎవరూ మేలు చేశారో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు. పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు మాట్లాడుతూ పేదల సంక్షేమమే సీఎం జగన్ ఎజెండా అని, రాష్ట్రాన్ని దండుకోవడమే టీడీపీ ఎజెండా అని విమర్శించారు. కార్యక్రమంలో నార్త్ అమెరికా స్పెషల్ రిప్రెంజేటివ్ ఫర్ ఏపీ పండుకాయల రత్నాకర్ నాయుడు, ఆరా ఫౌండేషన్ అధినేత మస్తాన్, మండల పార్టీ అధ్యక్షుడు గుత్తా యామలయ్య, ఎంపీపీ దేవినేని శంకర్రావు, జెడ్పీటీసీ కోడె సుధారాణి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

జిల్లాలో చివరి రోజు 89మంది నామినేషన్లు దాఖలు

11 పార్లమెంటుకు , 78మంది అసెంబ్లీకి

నరసరావుపేట : సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేసేందుకు జిల్లాలోని పార్లమెంటు, అసెంబ్లీ స్థానాలకు చివరిరోజు గురువారం 89మంది అభ్యర్థులు తమ నామినేషన్లు దాఖలు చేశారు. వీటిలో 11మంది పార్లమెంటుకు నామినేషన్లు దాఖలు చేయగా 78మంది ఏడు అసెంబ్లీలకు నామినేషన్లు వేశారు. పార్లమెంటుకు గర్నెపూడి అలెగ్జాండర్‌సుధాకర్ (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్), మహమద్ లక్మాన్, చలిచీమ వెంకటేశ్వర్లు, షేక్ జానిసైదా, కొమ్మురాజు, సైదారాజ్ (ఇండిపెండెంట్), ఓర్సు ప్రేమరాజ్, సంగం శ్రీకాంత్ రెడ్డి(బహుజన సమాజ్ పార్టీ), గనిపల్లి భూషణ్ (ఇండియా ప్రజాబంధు), పసుపులేటి పిచ్చయ్య (నేషనల్ నవక్రాంత్ పార్టీ), గార్లపాటి సుభాష్‌ప్రేమ్ (రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ) నామినేషన్లు వేశారు. అలాగే పెదకూరపాడు అసెంబ్లీకి నంబూరి వసంతకుమార్, నంబూరి శంకరరావు (వైఎస్సార్‌సీపీ), భాష్యం ప్రవీణ్, భాష్యం లావణ్య (టీడీపీ), ఆల్లా రామకృష్ణారావు(భారత చైతన్య యువజన పార్టీ), పమిడి నాగేశ్వరరావు(ఇండియన్ నేషనల్ కాంగ్రెస్), భాష్యం నవీన్, గౌతుకట్ల అంకమ్మరావు, నంబూరి కల్యాణ చక్రవర్తి, సెట్టి శ్రీదేవి (ఇండిపెండెంట్)గా నామినేషన్ వేశారు. చిలకలూరిపేట అసెంబ్లీకి ప్రత్తిపాటి పుల్లారావు తరపున షేక్ కరిముల్లా, కుంచావత్ సాంబశివనాయక్(టీడీపీ), ప్రత్తిపాటి పిచ్చయ్య, చెల్లి దయారత్నం, పొన్నగంటి సాంబశివరావు, టి.శివరామవినాయక్‌కుమర్, భూజమ్ రాజేష్, కట్టా కిరణ్‌కుమార్, కొర్రెపాటి సాయి గణేష్, తనుబొద్దు సుందరరామిరెడ్డి, ప్రత్తిపాటి రవిబాబు (ఇండిపెండెంట్)గా నామినేషన్లు వేశారు. నరసరావుపేట అసెంబ్లీకి గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తరపున గోపిరెడ్డి వెంకటరామిరెడ్డి (వైఎస్సార్‌సీపీ), చదలవాడ అరవిందబాబు, చదలవాడ ఆర్ఎస్ఎస్ ఆదిత్య (టీడీపీ), గంగుల మనోహర్ (భారతీయ చైతన్య యువజన పార్టీ), సరిమెల్లా నిరికిషన్‌రావు(జైభారత్ నేషనల్ పార్టీ), గోదా జాన్‌పాల్(జైభీమ్‌రావు భారత్ పార్టీ), షేక్ మహబూబుబాషా (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్), పత్రి అనీల్‌కుమార్, పులిమి వెంకటరామిరెడ్డి, షేక్ మహమద్ మంజూరు, కుమ్మెత కోటిరెడ్డి, బొగ్గరం వెంకట హనుమాన్ లక్ష్మీ సత్యనారాయణ మూర్తి, దండా అనీల్‌కుమార్ (ఇండిపెండెంట్)గా నామినేషన్లు వేశారు. సత్తెనపల్లి అసెంబ్లీకి మంత్రి అంబటి రాంబాబు (వైఎస్సార్‌సీపీ) కన్నా లక్ష్మీనారాయణ తరపున కె.పద్మ, వై.రామస్వామి(టీడీపీ), షేక్ దరియావలి (జైభారత్ నేషనల్ పార్టీ), యామోజీ హనుమంతరావు(యుగతులసి పార్టీ), గడ్డం రాంబాబు, కందుకూరి జక్రయ్య, పాతకోట రమేష్, మేకల వేణుమాధవరెడ్డి (ఇండిపెండెంట్)గా నామినేషన్లు వేశారు. వినుకొండ అసెంబ్లీకి యామల శ్రీనివాసరావు (ఆల్‌పీపుల్స్‌పార్టీ), జాలా ప్రసన్న, చెన్నా శ్రీనివాసరావు (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్), తిరుక్కావల్లూరు అనీల్‌కుమార్(జాతీయ జనసేన పార్టీ), చిరంజీవి నాయక్ (జైభారత్ నేషనల్ పార్టీ), వలపర్ల రమేష్ (లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ), కూకట్లపల్లి ప్రసాదు(జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ), మాసిపోగు యోసోబు, కూచిపూడి విజయకుమర్, జడ్డా శ్రీనివాసరావు, ములకా సీతారామ్, ధారనాసి రామకోటమ్మ (ఇండిపెండెంట్)గా నామినేషన్లు వేశారు. గురజాల అసెంబ్లీకి యరపతినేని శ్రీనివాసరావు (టీడీపీ), నీరుమళ్ల శ్రీనివాసరావు (అఖిల భారతీయ జనసంఘ్), షేక్ సైదావలి(రాష్ట్రీయ జనక్రాంతి పార్టీ), తియ్యగూర యలమందారెడ్డి(ఇండియన్ నేషనల్ కాంగ్రెస్), గడ్డం శ్రీనివాసరావు (ఆంధ్రరాష్ట్ర ప్రజాసమితి), జూలూరి రమేష్ (జైభీమ్‌రావు భారత్ పార్టీ), కాకర్ల మహేష్‌బాబు, బాదం వెంకటేశ్వరరెడ్డి, కొప్పరపు వెంకటపురుషోత్తమరావు, తమ్మిశెట్టి శంకరరావు, గంగవరపు మల్లమ్మ, తాయా వెంకటేశ్వర్లు, చీదెళ్ల వెంకటరవిబాబు(ఇండిపెండెంట్)గా నామినేషన్ వేశారు. అలాగే మాచర్ల అసెంబ్లీకి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి(వైఎస్సార్‌సీపీ), గుండాల సైదులు (బహుజన సమాజ్‌పార్టీ), నవులూరి శివారెడ్డి (జై భార్‌త నేషనల్ పార్టీ), బత్తుల విజయ (జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ), యెనుముల కేశవరెడ్డి(తెలుగు రాజాధికార సమితి పార్టీ), కొత్త రాజేష్, సూరా ప్రసాదు, గుమ్మడి కోటేశ్వరరావు, దేగల సైదరాజు (ఇండిపెండెంట్)గా నామినేషన్లు వేశారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి

ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి


రెంటాల పోలింగ్ బూత్‌లను పరిశీలించి పరిస్థితులను తెలుసుకుంటున్న ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి

రెంటచింతల: సమస్యాత్మకమైన గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి తెలిపారు.గురువారం ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి అకస్మికంగా రెంటాల గ్రామంలోని 239, 240, 241, 242 పోలింగ్ బూత్‌లను పరిశీలించి మాట్లాడారు. ఏర్పాటు చేసిన వెబ్ సీసీ కెమెరాల పనితీరు ఎలా ఉందని ప్రశ్నించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో ఎవరి ఓటు వారు హక్కును సద్వినియోగం చేసుకోవడానికి స్వేచ్ఛ కల్పించాల్సిన బాధ్యత మనదేనన్నారు. మండలంలో సమస్యాత్మక గ్రామాలు ఎన్ని ఉన్నాయి. ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు. ఓటర్లలో మనం పూర్తి మనోధైర్యం కల్పించాలన్నారు. రెంటచింతల మండలంలోని రెంటాల గ్రామం పరిస్థితి ఏమిటి..ఇక్కడ ఓటర్లు ఎంతమంది ఉన్నారు..పోలింగ్ ఎలా జరుగుతుంది..పోలింగ్ శాతం ఎంతవరకు ఉంటుంది..ఎన్నికల సమయాల్లో ఇక్కడ ఎలాంటి పరిస్థితులు ఉంటాయి..ఎందుకు సమస్యాత్మ కమైన గ్రామం అని ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంచికల్లు గ్రామాలలోని 243, 244, 245, 246 పోలింగ్ బూత్‌లను కూడ సందర్శించి పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు. చట్టం దృష్టిలో అందరూ సమానమేనని గుర్తుంచుకోవాలని ఓటర్లకు రక్షణ కల్పించడమే పోలీసుల లక్ష్యమన్నారు. ప్రజలు ధైర్యంగా వారి ఓటు వేసుకునేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. సమస్యాత్మకమైన పోలింగ్ స్టేషన్ల వద్ద ప్రత్యేక దళాలతో భద్రతా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టినా, భయందోళనకు గురిచేసినా, వారి ఓటు హక్కుకు భంగం కలిగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారి వెంట గురజాల డీఎస్పీ పల్లపురాజు, ఎస్ఐ కె. వెంకట నారాయణరెడ్డి తదితరులున్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా సహకరించాలి

- సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా
- జిల్లా ఎస్పీ బిందుమాధవ్
- పోలింగ్ బూత్‌లను పరిశీలించిన ఎస్పీ


ఇనిమెళ్లలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్పీ బిందుమాధవ్

ఈపూరు : ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని నరసరావుపేట జిల్లా ఎస్పీ బిందుమాధవ్ కోరారు. ఎటువంటి అల్లర్లకు పాల్పడినా చర్యలకు వెనుకాడబోమని ఆయన హెచ్చరించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిపారు. గురువారం మండలంలోని ఇనిమెళ్ల, బొమ్మరాజుపల్లి, అంగలూరు, బొగ్గరం గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను ఆయన సందర్శించారు. పోలింగ్ బూత్‌ల్లోని వసతులను, వెబ్ కెమెరాలు ఏర్పాటు చేసే అంశంపై స్థానిక అధికారులతో చర్చించారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఇనిమెళ్ల గ్రామంలోని బూత్‌లను సందర్శించిన అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ జిల్లాలో 587 సమస్యాత్మక పోతలింగ్ బూత్‌లను గుర్తించామని, 150 సమస్యాత్మక గ్రామాలను గుర్తించడంతో పాటు 12వేల మందిని బైండోవర్ చేశామన్నారు. వీరిని ఇప్పటికే పోలీస్‌స్టేషన్‌లకు పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. అల్లర్లు సృష్టించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచుతామని, ఎవరైనా పోలింగ్ సమయాల్లో గొడవలు సృష్టిస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. అలాగే ఇనిమెళ్లలో బుధవారం జరిగిన గొడవలపై ప్రత్యేక నిఘా ఉంచామని, మరలా అక్కడ గొడవలు జరగకుండా పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశామన్నారు. ఆయన వెంట నరసరావుపేట డీఎస్పీ వర్మ, రూరల్ సీఐ సుధాకర్, ఎస్ఐ మహమ్మద్ ఫిరోజ్ తదితరులు ఉన్నారు.

కుమారుడు డబ్బులు పంపలేదని తల్లి బలవన్మరణం

గణపవరం రాజీవ్‌గాంధీకాలనీలో విషాద సంఘటన


మండల లక్ష్మీదేవి మృతదేహం

నాదెండ్ల: పనికి వెళ్ళిన కుమారుడు సరిపడా డబ్బులు పంపలేదనే మనస్తాపంతో తల్లి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన గణపవరం రాజీవ్‌గాంధీకాలనీలో చోటు చేసుకుంది. నాదెండ్ల ఎస్సై జె బలరామ్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు మండల లక్ష్మీదేవి (36) రాజీవ్‌గాంధీకాలనీలో నివాసం ఉంటుంది. మృతురాలి భర్త రాముడు ఏడాది క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఏకైక కుమారుడు శివరామ్‌తో కలిసి అద్దె ఇంట్లో నివసిస్తున్నారు. కుమారుడు శివరామ్ పది రోజుల క్రితం రేకులు కప్పే పని ఒప్పుకుని నెల్లూరుకు వెళ్ళాడు. బుధవారం ఉదయం లక్ష్మీదేవి ఇంటి ఖర్చుల కోసం డబ్బులు కావాలని కుమారునికి ఫోన్‌చేసి అడగడంతో వెయ్యి రూపాయలు మాత్రమే పంపాడు. తనకు ఇవి సరిపోవని, మరికొంత పంపాలని, లేదంటే తాను ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించింది. ఆపై ఎలుకల మందు తిని అపస్మారక స్థితిలో పడిపోయింది. స్థానికులు గమనించి ఆమెను ఆటోలో చిలకలూరిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం 6.15 గంటలకు మృతి చెందింది. లక్ష్మీదేవి బంధువైన నాగజ్యోతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.